# భూగర్భంలో బందీ ??

— సంపత్

నేనా ఊరువచ్చి రెండు రోజులు గడిచాయి.

చుట్టూ పచ్చని చేలు. ఒక వయిపు పెద్ద పెద్ద కొండలు, కొండల కవతల సముద్రం ఉంది.

ఆ ఊళ్ళో నన్నెవరూ గుర్తుపట్టలేదు. దానికి తగినట్లు వేషం కూడా మార్చుకున్నాను. పాంటు, షర్టు ధరించి ఇన్ షర్ట్ చేశాను. పాంటు జేబులో ఎప్పుడూ రివాల్వర్, కత్తి రెడీగా ఉంటాయి.

పైగా అక్కడి ప్రజలు అమాయకులు. నాగరిక జీవితానికి దూరంగా, ప్రశాంతంగా గడుపుతున్నారు చదువు సంధ్యలు లేని ఆ ప్రజల్ని మభ్యపెట్టడం తేలిక అయింది.

ఆ ఊళ్ళో నన్ను చూసిన వారెవ్వరూ భయంకరమైన వ్యక్తి అని భావించరు. ప్రఖ్యాత బందిపోటు, దోపిడి దారు అయిన రాజుని నేనని ఎవరూ ఊహించనయినా లేరు.

పోలీసులు నాకోసం తీవ్రంగా వెదకుతున్నారని తెలుసు. కన్పిస్తే చాలు కాల్చిపారేసేటట్లున్నారు. కొంత కాలం ఈ పోలీసులబారి నుండి తప్పించుకొని విశ్రాంతి తీసుకోవాలనిపించింది.

అందుకే ఎవరికీ తెలియకుండా వేషాలు మారుస్తూ మారుమూల పల్లెటూరు అయిన ఈ పల్లెని చేరుకున్నాను. అసలు ఈ ఊరికి సరియైన రోడ్డే లేదు. నేనిక్కడ ఉంటానని పోలీసులు కలలోనైనా భావించరు.

ఆరోజుదయం లేచి కాలకృత్యాలు ముగించి డ్రెస్ చేసుకున్నాను... యింతలో ఫలహారం, కాఫీలతో లోనికి ప్రవేశించిందో వృద్ధురాలు. ఆ ఊరికి పూటకూళ్ళ యిల్లు అదే. ఆ వృద్ధురాలు దానికి యజమానురాలు.

టిఫిన్ చేసి, కాఫీ తాగాను. ఆమెతో చెప్పి బయట పడ్డాను.

మొదట్లో నన్ను వింతగా, జంతువుని చూసినట్లు చూసినా ఆ ప్రజలు నాకు అలవాటయిపోయారు. ఆ అడవులు, కొండలలో అమూల్యమయిన ఓషధులు, మూలికలు కోసం వెదుకుతున్నానని చెప్పి నమ్మించాను. దానికి కారణం లేకపోలేదు.

దాదాపు పదిహేనేళ్ళ క్రితం మాట ఇది. ప్రసిద్ధి బందిపోటు రాజాసింగ్ తను కొల్లగొట్టుకు వచ్చిన సొమ్ములో చాలాభాగం ఆ కొండలలోనే ఎక్కడో ఒక గుహలో దాచిపెట్టేవాడట. ఈ సంగతి రాజాసింగ్‌కు, మా నాన్నకు తప్ప మూడోవ్యక్తికి తెలియదు.

మా నాన్న ఆయన ముఠాలో ముఖ్య సభ్యుడు. సింగ్‌కి కుడిభుజం లాంటివాడు.

కాని ఒకసారి జరిగిన దోపిడిలో రాజాసింగ్ ప్రాణాలు కోల్పోయాడు. ఆయన ముఠా చెల్లాచెదరయ్యింది. కొంత మంది పోలీసులకు దొరికిపోయారు. నాకప్పుడు పది, పన్నెండు సంవత్సరాల వయసుంటుంది.

ఓరోజు రాత్రి నాన్న కుంటుకుంటూ వచ్చాడు. అమ్మ గాభరాగా తలుపుతీసింది. కాలంతా రక్తమైఉంది. అమ్మ మందుకోసం లోపలికి వెళ్ళగానే నాన్న నన్నుపిలిచి ఆ నిధి రహస్యం చెప్పాడు. ఏ నాటికయినా దాన్ని దక్కించుకోమన్నాడు. కాని అమ్మ మందు తెచ్చేలోపల పోలీసులు వచ్చి నాన్నను పట్టుకుపోయారు

తరవాత ఆయన్ని ఉరిదీశారు.

అమ్మ మొదట్లో దుఃఖించినా దుఃఖాన్ని దిగమింగు కొంది. నాకోసం పడరాని పాట్లుపడింది. అలా బి.యస్సీ. వరకు చదివాను కాని పూర్తిచేయలేదు.

ఇంతలో అమ్మ చనిపోయింది. ఉద్యోగం కోసం ప్రయత్నం చేయలేదు. మా నాన్న అడుగు జాడలలోనే నడిచాను. ఫలితంగా బందిపోటు రాజు అవతరించాడు.

ఇప్పుడిలాటి ఊరికి రావటంలో రెండు ఉద్దేశ్యాలు న్నాయి. ఒకటి పోలీసుల బారినుండి తప్పించుకోవటం, మరొకటి ఎంతోకాలంగా వెదుకుదామనుకుంటున్న నిధిని వెదకటం.

సంపాదించిన డబ్బు అంతా నీళ్ళలా ఖర్చుచేయటం వల్ల నా దగ్గర పెద్ద మొత్తంలో డబ్బులేదు. ఈ నిధి దొరికితే దొంగతనాలు మానేద్దామని అనుకున్నాను.

బయటకు నడిచి కొండలవైపు నడవసాగాను. ఊరికి సుమారు రెండుమైళ్ళ దూరంలో పడమర దిశలో

ఉన్నాయి కొండలు. వాటి కవతల సముద్రం మరో మైలు దూరంలో ఉంది.

రెండు రోజులపాటు కులాసాగా గడిపి, నన్నెవరూ గమనించటం లేదని నిర్ధారించుకున్నాను. ఈరోజు నుంచే నిధికోసం అన్వేషణ మొదలెట్టాను.

అయితే మొదట్లోనే చిక్కు వచ్చింది. మా నాన్న చెప్పిన నిధి తాలూకూ మార్గం నాకు గుర్తులేదు. లీలగా మెదులుతుంది తప్ప ఇతమిద్ధంగా తెలియదు.

అయినా ఒక క్లూ దొరికితేచాలు మిగిలినది దానంతటదే గుర్తుకు వస్తుందన్న భరోసా ఉంది.

అడుగులు వేగంగా వేస్తూ కొండ దగ్గరికి చేరుకున్నాను.

## 2

ఉదయం ఎనిమిది గంటలు కావస్తోంది.

ఒకదాని నొకటి ఆనుకొని నాలుగయిదు కొండలు ఉన్నాయి. వాటిల్లో ఒక గుహలోకి పోవాలి ముందు. అయితే ఏ గుహో గుర్తు తెలియదు.

చిత్రం ఏమిటంటే ఆ కొండలలోనే ఒక గుహ ఉందిట. దానిద్వారా పోతే అవతలివయిపుకు పోయేబిలం ఉందిట. అయితే అది మూసుకుపోయిందని కొందరు, కాదని కొందరు అంటుంటారు. ఆ గుహ మాత్రం ఏదో ఎవరికీ తెలియదు.

నెమ్మదిగా కొండ క్రిందభాగంలోకి చేరాను. ఎత్తుగా వినువీధిలోకి చూస్తున్నాయి శిఖరాలు. చుట్టూచూసి కొండ ఎక్కటం ప్రారంభించాను. బూటు కాళ్ళు జారిపోతున్నాయి. అయినా ఆ కొండ కొంచెం ఏటవాలుగా ఉంద

టంపలన ఎక్కటం సులభమే అయింది.

కొద్ది దూరం ఎక్కగానే సమాంతరంగా కాలిబాట కన్పించింది. ఆ బాట కొండచుట్టూ తిరిగి అవతలి వైపుకు పోతూంది. ఆ బాట వెంట నడవసాగాను.

పొదలు, ముళ్ళు దట్టంగా పెరిగిఉన్నాయి. చేతిలో రివాల్వర్ పట్టుకొని ఏదైనా విషజంతువు వస్తుందేమోనని చూస్తూ పోసాగాను.

దాదాపు అరగంట

నడిచి కొండ అవతలివైపుకు చేరాను. అవతలి కొండకు ఇవతలి కొండకు మధ్య చిన్న లోయలా ఉంది. యాభై అడుగులకు మించి ఉండదు. చిన్న సెలయేరు పైనుంచి ప్రవహిస్తోంది.

కడుపునిండా నీళ్ళుతాగి కొంచం దూరం నడిచి ఆగిపోయాను!

నిధికి మార్గం లీలగా గుర్తుకొస్తూంది. నాన్న చెప్పిన దాంట్లో సెలయేరు ఉంది. అయితే ఆ సెలయేరు యిదో, మరొకటో తెలియదు మాకు. కాని యిదేనని ఎదురుగా కన్పిస్తున్న ఆధారం చూడగానే అర్థమయిపోయింది.

నాకు ఎదురుగా కొంచందూరంలో, రెండో కొండ మీద సన్నని కాలిబాట పోతూంది. అది ఆ కొండను చుట్టి అవతలివైపుకు పోతూంది. ఆ కాలిబాట వెంట నడిస్తే ఒకచోట మార్గం చూపుతూ ఒకబొమ్మ ఉంటుందిట.

ఉత్సాహంగా నడిచాను.

కొద్దిదూరం పోగానే బొమ్మ కన్పించింది. కొండను చెక్కి దానిమీద బొమ్మను చిత్రించారు.. చూడటానికి ఆ యువతి నాట్యభంగిమలో ఉన్నా ఆమె కుడిచేయి వేలు

దిశ నిధిమార్గాన్ని చూపుతుందిట.

ఆ బొమ్మను గీసింది రాజాసింగ్. మంచి చిత్రకారుడతను. చూస్తే ఉబుసుపోక గీశారని అనుకుంటారెవరయినా.

వేలు చూపుతున్న దిశవయిపు సాగాను. కొంత దూరం పోగానే కొండలు రెండు కలిశాయి.

అక్కడ ఆగిపోయాను, రెండు గుహలు ఎదురెదురుగా ఉన్నాయి. వాటిల్లో ఒకటి నిధికిమార్గం. కాని ఏది? ఆలోచించసాగాను.

ఒకగుహ తూర్పుకి, మరోగుహ పడమరకు ఉన్నాయి. తూర్పు గుహలో ప్రవేశిస్తే మొదటి కొండలో ప్రవేశిస్తాము. పడమర గుహ మిగిలిన కొండలలోకి దారి చూపుతుంది.

నిధి కొండలలోనే దాచిఉంచారు గనుక, పడమర గుహే సరియైనదని ఊహించాను

ఇలా యోచించి పడమరగా ఉన్న గుహలోకి ప్రవేశించాను. కొంతదూరం పోగానే కటికచీకటి అలుముకుంది. చేతిలో టార్చికూడా లేదు. జేబులో పెన్‌టార్చి ఉన్నదన్న సంగతి గుర్తుకొచ్చి, వెలిగించాను చిన్నదయినా, ఫారిన్‌ది కావటంవల్ల కాంతి స్పష్టంగా ఉంది.

గుహను చూసి ఆశ్చర్యపోయాను. నల్లగా, శుభ్రంగా ఉన్నాయి గోడలు. లోపల ఏమన్నా జంతువులు ఉన్నాయేమోనన్న అనుమానం కలిగింది. జేబులో రివాల్వర్ ధైర్యాన్నిచ్చింది.

పెన్‌టార్చి వెలుగులో ముందుకి నడిచాను. అలా దాదాపు గంటసేపు నడిచాను. టైం మధ్యాన్నం కావొ

చ్చింది. ఎంతదూరం నడిచానో తెలియదు. ఆ చీకటి గుహకు అంతులేదు. నడిచి, నడిచి కాళ్ళు నొప్పెడుతున్నాయి. దాహం వేయసాగింది. వెంట వాటర్ బాటిల్ అయినా లేదు. ఈసారి అవసరమయిన సరంజామాతో రావాలనుకున్నాను.

వెనక్కి తిరిగి నడవసాగాను.

కొద్దిదూరం నడచి టక్కున ఆగిపోయాను. ఏదో శబ్దం!

ప్రవహిస్తున్న నీటిశబ్దం అది. నాకు కుడివయిపు చిన్న సందులాగా ఉంది. ఆ సందులోంచి శబ్దం విన్పిస్తోంది.

అంతకుముందా శబ్దంను నేను గమనించలేదు. బహుశా ఆలోచనలలోపడి ముందుకుపోయి ఉంటాను.

దాహం వేస్తూంది. ఆ నీటిని తాగి వెళదామనుకున్నాను.

పెన్‌టార్చిని ఆ సందులోనికి ఫోకస్ చేశాను. దాదాపు మనిషి దూరగలిగేంత ప్రదేశం మాత్రమే ఖాళీగా ఉంది.

ముందుకు నడిచాను. కొద్దిదూరం నడిచిన తరువాత దారి సన్నం అయింది. ఊపిరి సరిగ్గా ఆడటం లేదు. వెనక్కి తిరిగివొచ్చేద్దా మనుకున్నాను.

కాని దాహం నన్ను ముందుకి నడిపింది. నీటి శబ్దం దగ్గిరయింది.

లైటు ఆర్పి జేబులో వేసుకున్నాను. అడ్డంగాతిరిగితే సందు సరిపోతుంది. అలానే తిరిగి ప్రక్కకు పాకసాగాను.

కొద్దిదూరం నడిచేటప్పటికి దారి వెడల్పు అయింది.

నీటితుంపరలు మీదపడుతున్నాయి. ఆ కటికచీకటిలో ఏమీ కన్పించటం లేదు.

ఆనందంతో ముందుకు అడుగు వేసాను.

అంతే!

జర్రున జారినట్లయింది. నా కాళ్ళక్రింద భూమి తగ లేదు. ఏమయిందో తెలియలేదు చీకటిలో. కెవ్వున కేక వేస్తూ కళ్ళు మూసుకున్నాను.

# 3

దబ్బున నీళ్ళలోపడిన చప్పుడు విన్పించి కళ్ళు తెరచి చూశాను.

చుట్టూ అంధకారం. ప్రాణాలు పోయాయనుకున్న నేను, ఏదోచిన్న నీటిగుంటలో పడ్డానని తెలిసి సంతోషించాలో, లేక దిక్కులేని గుహలో, చీకట్లో యిరుక్కుపోయినందుకు విచారించాలో అర్థం కాలేదు.

నేను పడ్డ నీటికొలను అట్టె లోతులేదు కాబోలు, అడుగుచప్టాలా తగిలి నడుం నొప్పి పుట్టసాగింది. తల బట్టలు అన్నీ తడిసిపోయాయి.

పైకి ఈదుకుంటూ వచ్చాను. జేబులోనుంచి పెన్ టార్చి తీసి వెలిగించటానికి ప్రయత్నించాను, కాని వెలగ లేదు.

ఆ కటికచీకట్లో నా ప్రక్కకూడా ఏముందో తెలియ టంలేదు. పైనుంచి జలపాతం పడుతూంది. పెద్ద దెబ్బ లేమీ తగల్లేదు కాబట్టి, తక్కువ ఎత్తులోంచే క్రిందకు జారిపడ్డానని భావించాను.

కాని పైకి చేరేదెట్లా? ఈ చీకట్లో మార్గం ఎలా తెలుస్తుంది? అసలు పైకి చేరుకోగలనా? అన్న సందే

హాలు నన్ను పీడించసాగాయి. ఆలోచనలు కట్టిపెట్టి పైకిపోయే మార్గంకోసం అన్వేషణ ప్రారంభించాను.

జలపాతానికి దూరంగా ఈదుకుంటూ పోయాను. అయిదారు గజాల దూరం పోగానే గట్టుతగిలింది. ఆ చీకట్లోనే పైకితడిమి ఎక్కాను.

ఆ గట్టు వెడల్పు అడుగుపైనే ఉంటుంది. తరవాత గుహలాగా గోడలున్నాయి.

అంతా ఆశ్చర్యంగా అయోమయంగా ఉంది. ప్రాణ భయం ఎరగని నాకు యీ చీకటిలో భయం పుడుతూంది. చప్పున నాకో నవల గుర్తుకొచ్చింది. ఏప్రిల్ 75 "అపరాధ పరిశోధన సప్లిమెంట్" లోని రాజాగారి 'భూగర్భ సాహసయాత్ర'.

కొంపదీసి యిది కూడా భూగర్భ కేంద్రానికి మార్గం కాదుగదా! చిన్నగా నవ్వుకున్నాను. ఆ నవల కల్పితం, ఊహాజనితమైన నవల. అయినా చదువుతుంటే సమస్తం నిజం అనిపించేటట్లు ఉంటుంది.

నా ఆలోచనలు ఆపాను. ఏం చేయాలి? అక్కడినుంచి ఎలా బయటపడటం?

జలపాతం హోరు విన్పిస్తోంది. నీరు పైనుంచి పడటం వల్ల పెద్దగా శబ్దం విన్పిస్తూంది. నీటితుంపర్లు మీద పడుతున్నాయి.

గట్టుమీద కూర్చొని, కాళ్ళు నీళ్ళలో ఆడిస్తూ కూర్చుని ఆలోచిస్తున్న నేను చిన్నగా ఉలిక్కిపడ్డాను. ఆనందంతో మనస్సు ఉప్పొంగిపోయింది.

పైనుంచి పడే జలపాతం నీరు గట్టుదాటిరావటంలేదు. అంటే ఆ నీరంతా ఎక్కడితో ప్రవహిస్తున్నాయి. ఇక్కడి

నుంచి తప్పించుకోవడానికి మార్గం ఉండిఉండవచ్చు.

కాని మరో ఆలోచన నన్ను జలదరింపచేసింది. నేనను కుంటున్నట్లు ఈ నీటిప్రవాహం సన్నగా. మనిషి పట్ట నంత ఉంటే ?

తల విదిల్చాను. ఏమయినా ప్రయత్నించి చూడటం మంచిది. కాని ఆ చీకట్లో ఎలా? చాలా జాగ్రత్తగా వెద కాలి.

చుట్టు గోడ వెంట గట్టుమీదే నడిచాను తడుముకుంటూ. చుట్టూ తిరిగినా నా ప్రయత్నం ఫలించలేదు. నీటిలో మునిగి అడుక్కి చేరి తడమటం, గాలికోసం పైకివచ్చి అయిదు నిమిషాలాగి మరలా లోనికి పోవటం.

ఇలా దాదాపు రెండు గంటలు ప్రయత్నించిన అనం తరం దారి కన్పించింది. అడుగుభాగాన జలపాతానికి ఎడమప్రక్కగా ఉంది. మనిషి సులభంగా వెళ్ళిపోవచ్చు.

కాని...! ఆ మార్గం భూమిలోపలికి పోతుంది కనీసం ప్రక్కకన్నా దారితీసినా ఎలాగోలా పైకి చేరవచ్చు మార్గం ఉంటే! కాని యిది లోనికి పోతుందే? ముందు ముందు క్లిష్టమయితే !?

ఆ దారి వెంట ఈదుకుంటూ పోసాగాను.

మొదట్లో ఆ మార్గం నిలువుగా క్రిందికి దిగి, తరవాత క్రమంగా ఏటవాలు అయింది. వెనకనుంచి నీళ్ళు తోసుకు పోతున్నాయి నన్ను.

ఉన్నట్లుండి ఒక గోడకు గుద్దుకున్నాను. మొహం పచ్చడయిందనుకున్నాను కళ్ళు బైర్లుగమ్మాయి.

చేత్తో తడిమాను చుట్టూ. ప్రవాహం ఎడమవైపుకి తిరి గింది. ఆ చీకట్లో తెలియక గోడకి గుద్దుకున్నాను.

నేనుకూడా ఆ మార్గం వెంట ఈదసాగాను. ఈ మార్గం కూడా కొద్దిగా ఏటవాలుగా ఉంది. ముందుకు ముందుకు పోయేకొలది వాలుదనం ఎక్కువ అవుతూంది. అక్కడనుంచి బయటపడటం అసంభవం అనుకున్నాను.

కాని ఆ గుహల్లో, కొండల అడుగున ఆక్సిజన్‌కోసం ఇబ్బందిపడే అవసరం కలగకపోవటం నాకు కొంచెం ఆశ్చర్యకరమన్పించింది. కాని గాలి కావల్సినంత ఉంది. అంటే ఎక్కడో భూమిపైకి మార్గం ఉండాలి.

ముందుకు ఈదుతున్న నేను ప్రవాహవేగం ఎక్కువ కావటం గమనించాను. కొంపదీసి యిది మరో జలపాతం కాదుగదా ! అలా అయితే మరింత భూమిలోనికి దిగిన వాణ్ని అవుతాను.

ప్రవాహంతో పాటు పోతున్నాను. ఎంత ఎత్తునుంచి :దపడవలసివస్తుందోనన్న ఊహ రాగానే భయం గింది. మార్గం మధ్యలో ఆగిపోయినా లాభంలేదు. ఆగ టానికి వీలుగా ఏమీలేదు. గోడలు నున్నగా నీటిరాపిడికి అరిగిపోయి ఉన్నాయి.

క్రమంగా వేగం ఎక్కువయింది. కడుపులో ఆకలి మొదలయింది. నీర్సంగా ఉంది. టైం ఎంత అయిందో తెలియదు. నా ఊహ ప్రకారం సాయంత్రం మూడు, నాలుగు గంటలు కావచ్చు.

ఇంతలోనే ప్రవాహ వేగం మరింత ఎక్కువయింది. పైనుంచి నీళ్ళుపడుతున్న శబ్దం భీకరంగా విన్పించ సాగింది. ఆ శబ్దాన్నిపట్టి లోతుని అంచనావేయడానికి ప్రయత్నించాను. దూకటానికి రెడీగా ఉన్నాను.

మరో అర నిమిషం తర్వాత ఆ "చీకటి కొలను"లోకి

డైవ్ చేశాను.

దాదాపు నూటయాభై అడుగులు ఎత్తునుండి డైవ్‌చేసి ఆ కొలను అడుక్కిపోయాను. అదృష్టవశాత్తు ఆ కొలను చాలా లోతుగా ఉంది. అందువల్ల దెబ్బలు తగలకుండా తప్పించుకున్నాను.

పైకితేలి చుట్టూతడిమాను. యిక్కడ పై కొలను మాదిరిగా లేదు. అంతా గరుకురాళ్ళయి ఉండాలి. నీటి రాపిడికి అరిగిపోయి గులకరాళ్ళలా తయారయ్యాయి.

ఆకలిబాధ ఎక్కువయింది. పిచ్చిగా చుట్టూచూశాను. ఆ కటిక చీకటిలో ఏమి కన్పిస్తుంది ?

పై కొలను మాదిరే ఏదయినా మార్గం కన్పిస్తుందేమో నని అరగంట సేపు తడుములాడాను. ఆఖరికి దొరికింది.

గట్టుమీద సన్నగా రంధ్రంలా ఉంది. నీటిమట్టానికి గజం ఎత్తులో ఉంది. అయితే అది నడిచివెళ్ళడానికి అనువుగా లేదు. అసలు మనిషి పట్టలేదు. పడుకొని పాక్కుంటూ పోవాలి.

దానిలోనికి ప్రవేశించే ముందు రెండునిముషాలు ఆలోచించాను. అనవసరమయిన రిస్క్ అవుతుందేమో యిది! ఈ మార్గం మధ్యదారిలో ఆగిపోతే నాపనిఆఖరు. అసలే నీరసంగా ఉన్నాను. వెనక్కివచ్చే అవకాశంలేదు. ఆ రాళ్ళమధ్య యిరుక్కుపోవాల్సి ఉంటుంది.

చివరకు వెళ్ళటానికే నిశ్చయించుకున్నాను. ముందు తలను లోపలికి పంపాను. ఎలాగో తంటాలుపడి శరీరం మొత్తం చేర్చాను లోనికి.

ఊపిరి ఆడటంలేదు. వీపు పొట్టకు రాళ్ళు రాసుకుపోయి మంట పుడుతూంది. అయినా బాధని సహించి

ముందుకు సాగాను.

ఆకలిబాధ ఎక్కువయింది. ఇంకొంచెం సేపు అలానే ఉంటె చనిపోవటం ఖాయం. ఊపిరందక ఉక్కిరి బిక్కిరవుతున్నాను, లేనిశక్తి తెచ్చుకొని పాకుతున్నాను ముందుకు.

కొంతదూరం పోయేటప్పటికి దారి విశాలం అయింది. ప్రాణం తిరిగొచ్చింది. ఉత్సాహంతో ముందుకి పాకాను. కొద్దిదూరం పోయేసరికి నాముందు ఖాళీగావుంది. అది విశాలమయిన గుహ కాబోలు.

మెల్లగా లోనికి జారాను. పొడిగా ఉంది. అలసటతో కళ్ళు మూసాను. ఎంత సేపు నిద్రపోయానో తెలియదు. ఒళ్ళంతా నొప్పిగా ఉంది. నీళ్ళల్లో తడియడం వలన జ్వరం వచ్చినట్టు వళ్ళంతా వేడిగా ఉంది. కడుపులో ఆకలి. దానికితోడు దాహం మొదలయింది.

రెండు నిముషాలు అలానే చీకట్లోకి చూస్తూ కూర్చున్నాను. పాంటు, షర్టు ఆరిపోయాయి. ఒక్కటే ఉక్కగా ఉంది. యిప్పటివరకు నీటిలో మునిగిన నేను ఇక్కడ వాతావరణంచూసి కొంచెం ఆశ్చర్యపోయాను

ఆకలి దహించి వేయసాగింది. చీకటికి అలవాటు పడిన కళ్ళని చుట్టూ తిప్పాను. నేను ఎడమవైపు చూసి ఉలిక్కిపడ్డాను.

నాకు కొద్దిదూరంలో రెండు కాంతి గుళికలు కన్పిస్తున్నాయ్. అవి ఎలక్ట్రిక్ దీపాల్లా మెరుస్తున్నాయి. కొంచెంసేపు తరవాత గుర్ గుర్ మన్న చప్పుడు వినిపించింది.

భయంతో కొయ్యబారి పోయాను. ఏదో జంతువు

అయి ఉంటుంది. ప్రాచీన కాలంలో పెద్ద పెద్ద జంతువు లుండేవిట. బహుశా యిది అలాంటిదేనేమో !

జేబులు తడుముకున్నాను. కత్తి, రివాల్వర్ తగి లాయి. కత్తి చేతితో పట్టుకొని కూర్చున్నాను ఆ గుళికం వంకేచూస్తూ. అవి బహుశా ఆ జంతువు కళ్ళు అయి ఉండాలి.

ఇంతలో అది నోరుతెరచింది కాబోలు, నోటినుండి మంటలు వెలువడ్డాయి. ఆ కాంతిలో ఆ జంతువుని చూసి అదిరి పడ్డాను. రాక్షసి మొసలిఅది. ఆకారం మొసలిలానే ఉంది. అయితే కాళ్ళు ఉన్నాయో లేదో తెలియదు. అసలు కన్పించలేదు.

మరోసారి మంటలు వెలువడ్డాయి ఈసారి కాంతిలో ఆ గుహను పరికించాను. ఆ మొసలి అక్కడనుంచి కద ల్లేదని అర్థమయిపోయింది. లేకపోతే నన్ను ఎప్పుడో భోంచేసి ఉండేది.

నాకు కుడివయిపు గుహలోనుంచి విశాలమయిన మార్గం ఉంది. సునాయాసంగా పరుగెట్టవచ్చు. లేచాను. ఆకలి ఎటుపోయిందో తెలియదు. ముందుకు పరుగెట్టాను. నావెనుక మంటలు వెచ్చటిసెగ తగిలింది. అక్కడే ఉన్నట్లయితే మాడిపోయిఉండే వాడిని బహుశా నేను వెళ్ళటం అది గమనించిందేమో !.

ముందుకు పరుగెడుతున్నాను. ఎంతదూరం పోయానో తెలియదు.

ముందు కలిగిన అనుభవంతో చేతులు ముందుకు జాచి జాగ్రత్తగా పరుగెడుతున్నాను. ఏదైనా గోడ అడ్డువస్తే తెలిసిపోతుంది. ముఖం పచ్చడయ్యే బాధ ఉండదు.

బూట్ల చప్పుడు ప్రతిధ్వనిస్తోంది. నీళ్ళు పోయి తడిసినా వాటిని తీయలేదు.

పరుగెడుతున్నా నా భయం నాకుండనే ఉంది. యిటు వంటి జంతువులు యింకెన్ని ఉన్నాయో! లేకపోతే అదృష్టవంతుణ్ని. దీనికంటె భయంకరమైన జంతువు లుంటే నా పని ఆఖరు.

కొంతదూరం పోయేసరికి ఠంగున ముఖానికి కొట్టు కుంది గోడ.

చేతులకి తగలని గోడ ముఖానికి ఎలా తగిలిందో అర్ధం కాలేదు. తడిమాను. ముందు చిన్న ఖాళీ కన్పిం చింది. అక్కడనుంచి వంగి నడవాలి. నా ఎత్తుకంటే తక్కువగా ఉంది.

అలానే నడవసాగాను. నడుము నొప్పి పుట్టసాగింది. మరల అకలి వేయసాగింది. కళ్ళు తిరగసాగాయి. గాలి లేదేమో ఊపిరి ఆడటం లేదు. కొంతదూరం నడచి ముందు వెలుగు కన్పించటంతో అదిరిపడి ఆగిపోయాను.

మరో రాక్షస మొసలి కాదుగదా!.

రెండు నిమిషాలు అలానే ఉన్నాను. ఆ వెలుగు అలానేఉంది. అది ఏ జంతువూ అయిఉండదు. అంత కంటిన్యువస్‌గా ఏ జీవి వెలుగును విరజిమ్మలేదు. ముందుకి నడిచాను.

కొంతదూరం నడిచేసరికి గుహ అంతమయింది. అక్కడి దృశ్యం చూసి అవాక్కైపోయాను.

ముందు ఓమాదిరి వెలుగు ఉంది. చాలా పెద్ద గుహ అయిఉండాలి. దాని అంచులు కన్పించటం లేదు. ఆ వెలుగులో కన్పించిన దృశ్యం నన్ను ఆశ్చర్య చకి

తుణ్ని చేసింది.

పెద్ద పెద్ద పొదలు విశాలంగా ఉన్నాయి. వాటిమీద ఎర్రని ఆకులు కప్పబడి ఉన్నాయి. ఆ పొదలకు నల్లటి ఆపిల్ వంటి కాయలు వేలాడుతున్నాయి. కొద్ది దూరంలో ఏదో అంతర్వాహిని ప్రవహిస్తున్న చప్పుడు విన్పిస్తోంది.

కొద్ది క్షణాలు ఆశ్చర్యం నుంచి తేరుకోలేకపోయాను. నేను చూస్తున్నది భ్రాంతి అన్న అనుమానం వచ్చింది. లేకపోతే ఈ పొదలేమిటి? భూమిలో కొండల క్రింద ఈ కాయ లేమిటి ?.

ముందుకు నడిచాను. దాదాపు నా అంత ఎత్తున్నాయి పొదలు. ఫలాలు కోసుకున్నాను. మెత్తగా ఉన్నాయి. తినకూడదో, లేదో అని ఆలోచించకుండా తిన్నాను, ఛస్తే హాయిగా ఛస్తాను. లేదా ప్రాణాలు నిలుస్తాయి అనుకుంటూ. రుచిగానే ఉన్నాయి. ఫలాల నుంచి రసం కారుతూంది పిండుతుంటే.

కడుపునిండా తిని, అంతర్వాహినిలో నీళ్ళు తాగాను. కాస్త బాగున్న జాగా చూసుకొని మేను వాల్చాను. నిద్ర పట్టింది వెంటనే.

# 5

నిద్రలేచాను. ఎంతసేపు నిద్రపోయానో తెలియదు. ఆకలి తీరటంవలన హుషారుగా ఉంది. అంతేగాక అంతకు ముందులేని ఉత్సాహం కల్గుతూంది.

బుర్ర కొద్దిగా పనిచేయడం ఆరంభించింది. పొదలను పరిశీలించడం మొదలు పెట్టాను.

దాదాపు ఆరడుగుల ఎత్తులో ఉంది ఒక్కొక్క పొద. అటువంటివి దట్టంగా అలుముకుపోయి ఉన్నాయి. ప్రతి

పొదా ఎర్రని ఆకులతో కప్పపడి ఉండటమే కాకుండా, ఆపిల్‌వంటి ఫలాలు విరగకాచి ఉన్నాయి. పొదలకెలా కాచాయో అర్థం కాలేదు నాకు. అదే కాదు, మరొక విషయంకూడా అర్థం కాలేదు. ఆ లైటింగ్ మాత్రం ఎక్కడిది ?.

బహుశా ఆ గుహ పైభాగంలోఉన్న కణాలు అయనైజ్ అవటంవల్ల వెలుగు వస్తూందేమో ?.

ఆ అస్పష్టపు వెలుగులో కొద్ది దూరంలో మరో మార్గం చూశాను.

మరలా కడుపునిండా ఫలాలు తిన్నాను. షర్టువిప్పి పట్టినన్ని ఫలాలు మూట కట్టాను జాగ్రత్తగా. బనీన్, పాంటుతోనే నడిచాను ఆ గుహ వయిపు.

అయితే ఆ గుహలో కొద్ది దూరం పోగానే మరలా చీకటి మొదలయింది. చీకటికి నాకళ్ళు అలవాటు పడిందాక ఆగి బయలుదేరాను. ఈసారి చుట్టుప్రక్కల పరికిస్తూ నడుస్తున్నాను.

ఈ మార్గం నాకు అనుకూలంగా ఉన్నట్లనిపించింది. ఎంత దూరం పోయానో, ఎన్ని మలుపులు తిరిగానో లెక్కలేదు. కొంత పైకి పోతున్నట్లు అనుమానం కల్గింది. కాని నిర్ధారణగా తెలియలేదు.

చుట్టు ప్రక్కల పరికిస్తూ నడుస్తున్న నేను నాకు ఎడమ వయిపు ఒక గుహలాగా ఉన్నదాన్లో వెలుగు కన్పించటంతో ఆగిపోయాను. నా ముందు గుహ మార్గం మామూలుగానే ఉంది. అంటే మరోమార్గం చీలిందన్న మాట. ఆ కాంతి ఏమిటో తెల్సుకోవాలన్న ఉద్దేశ్యంతో వెలుగు వయిపు నడిచి, గుహలోకి తొంగిచూచి ఆశ్చర్య

పోయాను.

ఆ కాంతినిస్తున్న గుహ చాలా చిన్నది. లోపల చిన్న చిన్న రాళ్ళు, బండలు మొదలయినవి ఉన్నాయి. అన్నిటి కంటె ఆశ్చర్యం ఆ బండలు, రాళ్ళు స్వయం ప్రకాశక వస్తువుల్లా కాంతిని విరజిమ్ముతున్నాయి బంగారపు రంగులో ఉండి వెలుగును విరజిమ్ముతున్న ఆ రాళ్ళ కాంతే నాకు కన్పించింది.

ఆ రాళ్ళు బంగారం అనుకున్నాను. కాని బంగారానికి అంత కాంతి ఉంటుందా అన్న సందేహం వచ్చింది. భూమి మీద వెలుగులో దానికాంతి సరిగ్గా కన్పించదని, ఈ భూమిలోపల దాని అసలు కాంతి స్పష్టంగా కన్పి స్తుందని సరి పెట్టుకొన్నాను.

ఫలాలు పారబోసి బంగారంతో షర్టుని నింపుకుందా మన్న ఆశ బలవంతాన చంపుకున్నాను. అలా చేస్తే ప్రాణాలపై ఆశ వదలుకోవటమే. ఒక వేళ బాహ్య ప్రపం చానికి మార్గం తెలిస్తే తిరిగి వెనక్కి వచ్చి ఈ బంగారం తీసుకుపోవచ్చు. మరో అనుమానం వచ్చింది.

"రాజాసింగ్ దాచింది ఈ బంగారం కాదుగదా !" అనుకున్నాను.

కాని ఆయన నగలు, వజ్రాలు దాచాడని నాన్న చెప్పాడు. కనక యిది ఆ నిధి కాదు అని నిస్సందేహంగా చెప్పొచ్చు.

చటుక్కున నాకొక ఆలోచన వచ్చింది. చేతికి పట్టి నంత బంగారపు ముద్ద తీసుకున్నాను. కొన్ని ముద్దలను పాంటుజేబు లోపల, షర్టులో దోపాను. వెనుదిరిగి నడక సాగించాను.

నా అంచనా తప్పలేదు టార్చిలైటులా ఉపయోగ పడుతుంది చేతిలోని ముద్ద. ఇది అసలైన బంగారం కాబోలు!

అటూ యిటూ చూస్తూ నడవసాగాను. ఎంతదూరం నడిచానో తెలియదు. రాత్రో, పగలో తెలియదు. టైము తెలియదు. విచిత్రంగా యీ భూగర్భంలో బందీనై పోయాను. పైకి చేరుకుంటానో, లేదో తెలియదు. అలా పోతూనే ఉన్నాను.

కాళ్ళు నొప్పిగా ఉండటంతో ఒకచోట ఆగిపోయాను. ముందుకు నడవలేననిపించింది.

ఆ గుహమార్గానికి అంతులేదు. అసలాగుహలు భూమి లోపల, కొండల క్రింద ఎలా ఏర్పడ్డాయో నాకు అర్థం కాలేదు.

నా చేతిలోనున్న బంగారపుముద్ద వెలుగువల్ల పరిసరా లన్నీ స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఒక గోడకి ఆనుకొని కూర్చున్నాను.

బంగారపు ముద్దను గమనించి అదిరిపడ్డాను. అది కరిగిపోయినట్లు ఇదివరకటి కంటె చిన్నగా ఉంది. సైంటులో కూడా కొంచం తగ్గినట్లనిపించింది. ఈ వింత ఏమిటో అర్థంకాలేదు నాకు. చేతిలోది ఉన్నది ఉన్నట్లే మాయం అయిపోవడానికి యిది విఠలాచార్యగారి సినిమా కాదు. కాని మరెలా సంభవించింది?

ముద్దను నాకు ఎదురుగా నేలమీద పెట్టి, షర్టుమూట లోంచి రెండు ఫలాలు తీసి తిన్నాను. బంగారపురంగు కాంతి వెదజల్లుతూ మిలమిలా మెరుస్తూంది ముద్ద. దాదాపు అరగంటసేపు కూర్చున్నాను. నా ఎదుటనున్న

ముద్దలో మూడోవంతు తరిగిపోయింది.

చటుక్కున నాకో విషయం స్ఫురించి, కంపించి పోయాను.

ఇది నేననుకున్నట్లు బంగారపు ముద్ద అయి ఉండదు. ఏదో రేడియేషన్ పదార్థము అయి ఉంటుంది. అటువంటి పదార్థాలన్నీ అవిచ్ఛిన్నంగా తమనుంచి ఎలక్ట్రాన్లు, న్యూట్రాన్లను బయటికి కిరణరూపంలో పంపుతుంటాయి. అందువల్ల ఆ పదార్థాలు క్రమంగా తరిగిపోతుంటాయి.

ఇదికూడా అటువంటి రేడియేషన్ పదార్థం అయ్యి తీరాలి. లేకపోతే ఎలా తరిగిపోతుంది?

నా ముందున్నది రేడియేషన్ పదార్థం అని ఊహించ గానే తలదిరిగి పోయింది. అణుబాంబుకి, ఎక్సరే మొద లయిన వాటికి ఉపయోగించే రేడియేషన్ పదార్థం. ఒక్క గ్రాము పదార్థం కోసం కొన్ని కోట్ల రూపాయలు ఖర్చు బెడుతున్నాం.

కాని...యిక్కడ భూగర్భంలో టన్నులకొద్ది నిక్షిప్త మయి ఉంది. కాని యిదేమిటి?

సాధారణంగా రే డి యే ష న్ కి గురియైన వాళ్ళకి ప్రమాదం సంభవిస్తుంది. కళ్ళుపోవటం, కేన్సర్‌రావటం, ప్రాణాపాయం కూడా సంభవించ వచ్చు. కాని నేను మాత్రం నిక్షేపంగా ఉన్నాను. అయితే యిది రేడియేషన్ పదార్థం కాదా?

ఉహుం! ఇది తప్పకుండా రేడియో ఏక్టివిటీ గల్గిన పదార్థమే. అయితే అటువంటి ధర్మాలున్నా కూడా, ఏ హాని చేయలేదేమో!

నాకు ఎదురుగానున్న గోడనుండి ఏదో చప్పుడు

రావటంతో ఆలోచనలోంచి బయటపడ్డాను. ఏదో బరువయిన వస్తువుతో, కొడుతున్న శబ్దం· ఎంత మందం ఉందో ఆ గోడ !

చటుక్కున నాకో విషయం జ్ఞాపకం వచ్చింది. సముద్రతీరంలో ఏదో శాస్త్రజ్ఞుల బృందం పరిశోధనలు జరుగుతుందని విన్నాను. బహుశా వాళ్ళె ఎందుకో పగల కొడుతున్నారేమో। అయినా యింత లోతులో పగలకొట్టి ఏంచేస్తారు ?

నవ్వుకున్నాను నేను. ఆ ప్రశ్నకి అర్థంలేదని తెల్సు. ప్రతిచిన్న విషయం శాస్త్రజ్ఞులకి ఎంతో ఉపయోగిస్తుంది.

ఉన్నట్టుండి శబ్దం ఆగిపోయింది. రెండు నిమిషాలు వేచిచూశాను. భయం వేసింది. ఏమయింది ? వెళ్ళిపోయారా ! అలాఅయితే నాకు చిక్కిన అవకాశం చేజారిపోయినట్లే !

గోడదగ్గరకు చేరి బిగ్గరగా అరచాను మూడునాలుగు సార్లు. ఏమిసమాధానం లేదు. అసలు విన్పించిందో లేదో ! నేలమీద ముద్ద కరిగిపోతూంది. క్షణ క్షణానికి ఆత్రత ఎక్కువయిపోతూంది.

ఉన్నట్లుండి గబుక్కున లేచినిలబడ్డాను.

ఒకవేళ ఏద్దైనా డైనమైట్ అరేంజ్ చేయలేదు గదా !

ఆ ఊహ రావటంతోనే నేలమీదనున్న షర్టుమూట తీసుకొని, జేబులోనుంచి మరో ముద్దను తీసి పట్టుకొని ఆ సొరంగం వెంట చాలాదూరం పరుగెత్తాను.

దూరంగా పోయి వెనక్కుతిరిగి చూడసాగాను. కాలం గడిచిపోతోంది. ఆత్రంగా ఎదురుచూస్తున్నాను, డైనమైట్ పేలిన శబ్దంకోసం.

# 6

అరగంట గడిచింది. డైనమైట్ పేలలేదు.

హతాశుణ్ని అయిపోయాను. ఏది జరగకూడదను కున్నానో అదే జరిగింది. బాహ్య ప్రపంచంలోకి పోవ టానికి గల ఒకే ఒక ఆశ అణగారిపోయింది. తల పట్టు కొని కూర్చుండిపోయాను.

ఇప్పటికే ఎన్నో గంటలు ఒంటరిగా, భయంగా ఈ భూగర్భంలో గడిపాను. గాలి సరిగ్గా ఆడటంలేదు యిక్కడ. విపరీతమయిన ఉక్కపోస్తుంది. ఎలా తప్పించుకోవటం ?

ఈ భూగర్భంలోనుంచి మార్గం ఎక్కడుంది ? ఎలా వెదకను ? ఎన్నిరోజులు వెదకను ?

జేబులోనుంచి కరిగిపోతున్న ముద్దను తీసాను. చాలా వరకు కరిగిపోయింది. చాలాతక్కువ కాంతి వెలిగక్కు తూంది. ఆ అస్పష్టపు కాంతిలోనే పరిసరాలు పరిశీలించి చూశాను.

నాకు కొద్దిదూరంలో గుహ అంతమైపోయినట్లు కన్పిం చింది. లేచి అక్కడకు నడిచాను

అదొక కూడలి. అయిదారు మార్గాలు వచ్చి కలిశాయి ఆ హాలులాంటి గుహలో. నాలోమళ్ళీ ఆశ మొలకెత్తింది.

ఈ మార్గాలు అన్నింటినీ పరీక్షిస్తే ఏదోఒకటి భూమి పైకి పోయేమార్గం చూపదా ? అనుకొని మనస్సులో గుణించుకున్నాను. ఒకమార్గం ఎన్నుకుని ముందుకు సాగాను.

చేతిలోనున్న చిన్న ముద్దతో ముందుకు సాగుతు న్నాను. చాలా దూరం అంటే దాదాపు రెండు మైళ్ళ

వరకుపోయి ఉంటాను. ఆ దోవ అంతా వంకర టింక రగా ఉంది. కొంత దూరం సమాంతరంగా, మరి కొంత దూరం పైకి, ఇంకొంత దూరం పల్లంలోకి దిగుతూ రక రకాలుగా ఏర్పడి ఉంది.

అయితే ఎంతకి ఆ మార్గం అంతం అయ్యేట్లు కన్పించ లేదు. కాని నేను మాత్రం పైకి వెళుతున్నానని రూఢి అయ్యింది.

చాలా దూరం పోయాను. ఆకలి వేసింది. షర్టు విప్పి మిగిలిన ఫలాలు తిన్నాను. అయిపోయాయి అవి. వాటి కోసం వెనక్కి వెళ్ళే ప్రశ్నలేదు. దోవ కూడా గుర్తులేదు. అంతగా అయితే కత్తితో పొడుచు కుని చచ్చిపోతాను.

షర్టు తిరిగి తొడుక్కున్నాను. టక్కున ఆగాను. ఏదో శబ్దం! చెవులురిక్కించాను. జల ప్రవాహం! ఆనందంతో అరిచాను. మారుమోగి పోయింది.

మరి కొంత ముందుకు పోయాను. నా ముందు చిన్న జల ప్రవాహం రెండు గోడలకు అడ్డంగా ప్రవ హిస్తోంది. స్వచ్ఛమైన నీళ్ళు. కడుపు నిండా తాగాను. లేచి నిలబడి చుట్టూ చూడటానికి తల తిప్పాను.

అంతే !

అదే క్షణంలో నా నెత్తిమీద పిడుగులు పడ్డంత శబ్దం అయింది. క్షణకాలం దిమ్మెరపోయాను. భయంతో వెనక్కి పరుగెత్తి తిరిగి చూశాను.

మరు క్షణమే మిక్కిలి వేగంతో నీరు లోనికి ప్రవహించింది. సముద్రపు నీరు!

అదే క్షణంలో నా బుర్రలో చురుక్కున ఆలోచన

మెదలింది. చుట్టూచూసి మొనలాగా పైకి పొడుచుకు వచ్చిన రాతి నొక దానిని గట్టిగా కౌగిలించుకొన్నాను.

మరు క్షణమే విపరీత మయిన ఒత్తిడితో జివ్వున సముద్రపు నీరు వచ్చి నన్ను తాకి ముందుకు పోయింది.

ఆ వేగానికి పట్టు వదలుతానేమోననుకుని, మరింత గట్టిగా కౌగిలించుకున్నాను.

సముద్రపు నీటితో పాటు వచ్చిపోయిన చేపలు, జంతువులు రా సాగాయి. ఏమీ అర్థంగాక అలానే బండ రాతికి అతుక్కుపోయాను. నీరు ప్రవహిస్తూనే ఉంది.

# 7

రెండు గంటలు గడిచి పోయాయి.

నీటి మట్టం క్రమంగా ఎక్కువవుతూంది. నీరు కూడా ముందంత ఉరవడిగా ప్రవహించడంలేదు. అదే క్షణంలో ప్రాణం ఉన్న జంతువులు కూడా లోనికి రా సాగాయి. అదిరి పడ్డాను. టక్కున నాకో ఆలోచన మెదిలింది.

"గుహ నిండితే నేను చావటం ఖాయం. నిండి పోవటం ఖాయం. చిల్లు పడింది సముద్రానికి. నీటికి కొదవలేదు. జంతువులు కూడా నన్ను భక్షించటానికి అవకాశం ఉంది. యిదే చివరి ప్రయత్నం." అనుకున్నాను.

జేబులోనుంచి కత్తి తీసి ముందుకు ఈదాను. అడ్డు వచ్చిన చేపల్ని కత్తితో పొడుస్తూ ముందుకు ఈదుతున్నాను.

నా ఊహ నిజమయి ఉంటుంది. సముద్రం మీద పరిశోధనలు జరుపుతున్న శాస్త్రజ్ఞులు ఎందరో బాంబ్

పేల్చి ఉంటారు. అదృష్టవశాత్తు సముద్రం అడుగున చిన్న చిల్లు పడి ఉంటుంది.

ప్రాణం మీద తీపితో ముందుకు ఈది, చిల్లు దగ్గరకు చేరుకున్నాను!

ఒక్క క్షణం ప్రవాహంకు అభిముఖంగా తలెత్తి చూసి వెంటనే ప్రక్కకు తప్పుకున్నాను.

సుమారు అడుగున్నర వ్యాసండున్న చిల్లు కన్పించింది. అయితే అప్పుడే ఏదో జంతువు ప్రవేశించింది. చటుక్కున వెనక్కి తగ్గి ఆ జంతువు నన్ను చూడకుండా జాగ్రత్త పడ్డాను. వెంటనే కత్తి ఉన్న కుడి చేతిని ముందుకు జాపి దాని డొక్కలో గుచ్చాను.

చిల్లు ముందుకు చేరాను. పైనుంచి కాంతి అస్పష్టంగా కన్పిస్తూంది. అంటే ఎక్కువ లోతులోలేను. వెంటనే ఒక్క సారిగా ఆ చిల్లులో ప్రవేశించాను. నాలుగడుగుల మందం ఉంది సముద్రం అడుగు భాగం. రివ్వున పైకి పోతున్నాను.

ఊపిరి అడటంలేదు. శ్వాసిబిగించి ఉండలేననిపించింది. చేతులతో నీళ్ళను క్రిందికి నెట్టుతూనే ఉన్నాను.

ఇక భరించ లేకపోయాను. నోరుతెరిచాను. నీళ్ళు ప్రవేశించాయి. అదేక్షణంలో సముద్రంపైకి తేలాను. కళ్ళు మూతలు పడుతున్నాయి. స్పృహతప్పి పోతాననిపించింది.

భారంగా కళ్ళు తెరిచి చుట్టూ చూసాను. ఫర్లాంగు దూరంలో ఏవో నౌకలు కన్పించాయి. నౌకలలోని వాళ్ళంతా ఆశ్చర్యంగా నా వైపే చూస్తున్నారు. పెద్దగా అరిచి స్పృహ తప్పాను.

అయిపోయింది.